సాక్షి జగిత్యాల

శుక్రవారం । 2 । జూన్ । 2023

ఘనంగా స్వాతి నక్షత్ర పూజలు



ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ శ్రీఉగ్రనృసింహస్వామి ఆలయంలో గురువారం స్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రం పూజలు ఘనంగా నిర్వహించారు.



వరి కొయ్యలను కాల్చొద్దు

పంటను కోయించిన తర్వాత రైతులు వరి మొదళ్లు కాల్చుతున్నారు. దీంతో ఉపయోగం కంటే నష్టమే ఉంటుందని ఉందని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 40.0/28.0

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమవుతుంది. పగలు ఉక్కపోతగా ఉంటుంది. ఎండ తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

టెండర్లు లేకుండానే పనుల అప్పగింత

జగిత్యాల: తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని జిల్లాలో ఉత్సవాల నిర్వహణకు మున్సిపల్ జనరల్ ఫండ్ నుంచి రూ.15 లక్షలు కేటాయించారు. టెండర్లు లేకుండా నిధులు కేటాయించడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ధర్మపురిరోడ్, నిజామాబాద్ రోడ్, కరీంనగర్ రోడ్‌లో ఆర్చీలతో పాటు ప్రధాన కూడళ్ల వద్ద హోర్డింగ్‌లకు ఫ్లెక్సీలు, జంక్షన్ల వద్ద మైక్‌సిస్టమ్, ర్యాలీలకు క్యాప్‌లు, టీషర్ట్‌లు, పలుచోట్ల బెలూన్‌లు ఏర్పాటు చేయనున్నారు. అయితే మున్సిపల్‌లో రూ.లక్ష వ్యయంతో చేపట్టే పనులు మాత్రమే టెండర్ లేకుండా చేసుకునే అవకాశం ఉంది. కాగా కలెక్టర్ ఆదేశాల మేరకే రూ.15 లక్షలు కేటాయించడం జరిగిందని, ఇంకా దానికి మించిన ఖర్చు అయ్యే అవకాశం ఉందని బల్దియా అధికారులు పేర్కొంటున్నారు. సమయం లేకపోవడంతో టెండర్లు వేయకుండా పనులు కేటాయించడం జరిగిందని వివరించారు. ఈనేపథ్యంలో ఉత్సవాల పేరిట ప్రజాధనం ఖర్చు పెట్టడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. బల్దియాలో సమస్యలను పట్టించుకోవడంలేదని, ఉత్సవాలకు మాత్రం ఇష్టానుసారంగా మున్సిపల్ నిధులు కేటాయిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే కొనుగోళ్లలో జాప్యం



రైతులతో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే వరిధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరుగుతోందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం జగిత్యాల అర్బన్ మండలం మోతె గ్రామంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో తూకం వేయని ధాన్యం సుమారు 10–15 క్వింటాళ్లు ఉందని, అలాగే తూకం వేసిన సుమారు 4–5 వేల బస్తాలు లారీలు లేక తరలించడం లేదని రైతులు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎమ్మెల్సీ జిల్లా ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడారు. లారీలు పంపించడంతో పాటు పేరుకుపోయిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలన్నారు. నెలల తరబడి కొనుగోళ్లలో జాప్యం జరగడంతో రైతులు కళ్లాల వద్దే పడిగాపులుగాస్తూ ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని యుద్ధప్రతిపాదికన కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాముల గంగాధర్, లింగారెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


తుమ్మెనాలలో ముగిసిన కొనుగోళ్లు



ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్న చైర్మన్, తదితరులు

ధర్మపురి: మండలంలోని తుమ్మెనాల గ్రామంలో డీసీఎమ్మెస్ ఆధ్వర్యంలో చేపట్టిన ధాన్యం కొనుగోళ్లు గురువారంతో ముగిశాయని ఉమ్మడి జిల్లా డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. గ్రామంలోని 220 మంది రైతుల నుంచి 8,800 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేష్, నాయకులు రంగ శంకరయ్య, ఆలయ కమిటీ సభ్యుడు వెంకటేశ్వర్‌రావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

'గోదావరి హారతి' విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రాయికల్(జగిత్యాల): ధర్మపురిలో ఈనెల 3 నుంచి 8 వరకు నిర్వహించే గోదావరి హారతి యాత్రను విజయవంతం చేయాలని జిల్లా కన్వీనర్ పిల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం రాయికల్‌లో గోదావరి హారతి యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా యాత్ర ప్రముఖ్ నరేంద్ర, జిల్లా మహిళామోర్చా అధ్యక్షురాలు సురతాని భాగ్యలక్ష్మి, బీజేపీ మండల అధ్యక్షుడు అన్నవేని వేణు, జిల్లా నాయకులు కుర్మ నారాయణరెడ్డి, మచ్చ నారాయణ, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు తోపారపు ఆశాలు, నాయకులు సామల్ల సతీశ్, తిప్పిరెడ్డి శేఖర్‌రెడ్డి, భూమేశ్, సతీశ్, లక్ష్మీనారాయణ, సంజీవ్ పాల్గొన్నారు.



విద్యుత్ కాంతుల్లో నూతన కలెక్టరేట్ భవనం

తొమ్మిదేళ్లు.. ప్రగతి పరవళ్లు

- అభివృద్ధి బాటలో జగిత్యాల
- వైద్యం, విద్య అందుబాటులోకి
- పెరిగిన వ్యవసాయ సాగు విస్తీర్ణం
- నేడు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

జగిత్యాల: జగిత్యాల అన్ని రంగాల్లో ముందంజలో ఉంది. జిల్లాలో అభివృద్ధి పరవళ్లు తొక్కుతోంది. తెలంగాణ ఏర్పాటుకు తర్వాత జిల్లాల పునర్విభజనలో భాగంగా జగిత్యాల జిల్లాగా అవతరించింది. దీంతో ప్రజలకు ఎంతో వెసులుబాటు కలిగింది. సాగువిస్తీర్ణం పెరిగి వ్యవసాయ రంగం అభివృద్ధి చెందింది. జిల్లా కేంద్రంలో మెడికల్ కళాశాల ఏర్పాటుతో వైద్య సేవలు పెరిగాయి. మున్సిపాల్టీల్లో అభివృద్ధి, సుందరీకరణ పనులతో నూతన శోభను సంతరించుకున్నాయి. నేడు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా ప్రగతిపై కథనం..



రూపుదిద్దుకుంటున్న ఎస్పీ కార్యాలయం

అందుబాటులోకి పలు సేవలు

జిల్లా కేంద్రంలో రూ.25 కోట్లతో నిర్మించిన కలెక్టరేట్ భవనాన్ని సీఎం కేసీఆర్ డిసెంబర్ 7న ప్రారంభించడంతో 54 శాఖలు ఒకేచోటకు వచ్చాయి. జిల్లా కేంద్రంలో ఎస్పీ కార్యాలయం, కొత్త మండలాల్లో పోలీస్‌స్టేషన్లు ఏర్పాటయ్యాయి. ధరూర్ క్యాంప్‌లో 27 ఎకరాల్లో మెడికల్ కళాశాల నిర్మాణం జరుగుతుంది. జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు కావడం, ఎన్‌ఎంసీ అనుమతులు రావడంతో గతేడాది నుంచే 150 మంది వైద్య విద్యార్థులతో బోధన తరగతులు కూడా ప్రారంభమయ్యాయి. అలాగే ధరూర్ క్యాంప్‌లో రూ.17 కోట్ల వ్యయంతో నిర్మించిన మాతాశిశు సంక్షేమ కేంద్రం గర్భిణులకు వరంగా మారింది. ఇందులో నెలకు 300–400 ప్రసవాలు జరుగుతున్నాయి. కోరుట్లలో 50 పడకల సామర్థ్యం గల ఆస్పత్రి, ధర్మపురి, రాయికల్, మెట్‌పల్లి, కోరుట్లలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య విధాన పరిషత్ ఆధీనంలోకి రాగా, అనేక మౌలిక వసతులు ఏర్పడ్డాయి. కొత్తగా మాతాశిశు కేంద్రంలో టిఫా స్కానింగ్‌తో పాటు రేడియాలజీ ల్యాబ్, కంటి ఆపరేషన్ల రూమ్‌లను ఏర్పాటు చేశారు. రేడియాలజీ ల్యాబ్ పేదలకు వరంగా మారింది. దాదాపు అన్ని రకాల పరీక్షలు ఇందులో చేస్తున్నారు.

సాగునీటి వనరుల్లో కొంత వెనుకబాటు..

జిల్లాలో ముఖ్యంగా బీర్‌పూర్, ధర్మపురి మండలాల్లో 25 వేల ఎకరాలకు సాగునీరు అందించే రోల్లవాగు ప్రాజెక్ట్ పనులు 90 శాతం పూర్తికాగా, 10 శాతం మిగిలిపోయాయి. రూ.60 కోట్లతో మొదలైన వ్యయం రూ.130 కోట్లకు చేరింది. అలాగే కథలాపూర్ మండలం కలికోట గ్రామంలో గతంలో సూరమ్మ ప్రాజెక్ట్ పనులను మంత్రి హరీశ్‌రావు ప్రారంభించినా ఇప్పటికీ పూర్తి కాలేదు. రూ.204 కోట్లతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్ పూర్తయితే 50 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. మల్లాపూర్ మండలం వాల్గొండలోని గోదావరి సమీపంలో రూ.22 కోట్లతో నిర్మిస్తున్న ఆనకట్ట పనులు పూర్తి కాలేదు.

ఇథనాల్ ప్రాజెక్ట్‌కు అడ్డంకులు

జిల్లాకు ఇథనాల్ ప్రాజెక్ట్ మంజూరైనా సమీప గ్రామాల ప్రజలు అడ్డుకోవడంతో ఆదిలోనే అడ్డంకులు మొదలయ్యాయి. ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే దాదాపు 3 వేల మందికి ఉపాధి లభిస్తుంది. ఈ పరిశ్రమకు ధర్మపురి నియోజకవర్గంలోని స్తంభంపల్లిలో 200 ఎకరాల స్థలం సైతం కేటాయించారు.

పెరిగిన సాగు విస్తీర్ణం



జగిత్యాల వ్యవసాయాధారిత జిల్లా. మిషన్ కాకతీయ చెరువుల పూడికతీతో పాటు, ఎస్సారెస్పీ ద్వారా వచ్చే నీటితో జిల్లాలో వరిసాగు విస్తీర్ణం పెరిగింది. ఆయకట్టు ప్రాంతం కావడంతో వరి, మామిడి, మొక్కజొన్న ఎక్కువగా సాగుచేస్తుంటారు.



వేడుకలకు ముస్తాబైన యావర్‌రోడ్డు

ఆలయాల అభివృద్ధికి అడుగులు

జిల్లాలోని కొండగట్టు అంజన్న, ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి, కోటిలింగాల ఆలయాలు అభివృద్ధిలో కొంత వెనుకంజలో ఉన్నాయి. సీఎం కేసీఆర్ కొండగట్టును ఫిబ్రవరి 15న సందర్శించి రూ.100 కోట్లు ప్రకటించినా ఇప్పటికీ పనులు కావడం లేదు. ధర్మపురిలో రూ.100 కోట్లతో పనులు ప్రారంభించినా ఒక శాతం కూడా పూర్తి కాలేదు. కోటిలింగాలలో రూ.35 కోట్లతో పనులు నెమ్మదిగా సాగుతున్నాయి.

విద్యారంగానికి ప్రాధాన్యత

జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మనఊరు– మన బడి కింద మౌలిక వసతులు కల్పిస్తున్నారు. జిల్లాగా ఏర్పడిన తర్వాత పదో తరగతి ఫలితాల్లో మూడుసార్లు హ్యాట్రిక్ సాధించి రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో నిలిచింది. ఇటీవల కొంత వెనుకబడినా విద్యాధికారులు మళ్లీ మొదటి స్థానం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నారు. జిల్లాలోని ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాలలో కొత్తగా పీజీ కోర్సులు ప్రారంభించడంతో గ్రామీణ ప్రాంత మహిళ విద్యార్థులకు వరంగా మారింది.

దశాబ్ది ఉత్సవాలకు సిద్ధం



విద్యుత్ కాంతుల్లో కొత్తబస్టాండ్ కూడలి

జగిత్యాల: దశాబ్ది వేడుకలకు అధికారులు సిద్ధం చేశారు. ఇప్పటికే కార్యాలయాలు, ప్రధాన కూడళ్లకు లైటింగ్ ఏర్పాటు చేసి ముస్తాబు చేశారు. ఉత్సవాలు ఎలా నిర్వహించాలో కలెక్టర్ యాస్మిన్‌బాషా అధికారులతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు.

ఆవిర్భావ వేడుకలకు మంత్రి



జగిత్యాల: జిల్లాలో నేటి నుంచి నిర్వహించే దశాబ్ది ఉత్సవాల్లో మంత్రి కొప్పుల ఈశ్వర్ పాల్గొంటారు. ఉదయం 8.15 గంటలకు గెస్ట్‌హౌస్‌కు చేరుకొని 8.20 గంటలకు అమరవీరుల ఉద్యానవనం ప్రారంభిస్తారు. 8.55 గంటలకు జిల్లా సమీకృత కలెక్టరేట్ భవనానికి చేరుకుని కార్యక్రమంలో పాల్గొంటారు. 9 గంటలకు కలెక్టరేట్‌లో పతాకాన్ని ఆవిష్కరించి ప్రసంగించనున్నారు.

వైభవంగా నిర్వహిస్తాం



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్

జగిత్యాల: జిల్లాలో దశాబ్ది వేడుకలు వైభవోపేతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయడం జరిగిందని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామాల నుంచి జిల్లాస్థాయి వరకు ఏ రోజు కార్యక్రమాలు ఆ రోజు చేపట్టాలని, ప్రజాప్రతినిధులందరినీ సమన్వయం చేసుకుంటూ ఈ పండగ నిర్వహించాలన్నారు. వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, జర్నలిస్టులు, కళాకారులు పాలుపంచుకోవాలని పేర్కొన్నారు. ఆమె వెంట అడిషనల్ కలెక్టర్లు ఉన్నారు.

ఎస్సారెస్పీ కాలువపై కల్వర్టు అక్రమ నిర్మాణం



కాలువపై అక్రమంగా నిర్మిస్తున్న కల్వర్టు

- నిర్మాణానికి మున్సిపల్ ట్యాంకర్లతో నీరు
- పట్టించుకోని అధికారులు

జగిత్యాలరూరల్: జగిత్యాల మున్సిపల్ పరిధిలో చాలా మంది శివారు ప్రాంత ప్రజలకు తాగునీరు అందక ఇబ్బందులు పడుతుంటే మున్సిపల్ అధికార యంత్రాంగం మాత్రం ఓ వ్యాపారి అక్రమ కట్టడానికి ఏకంగా మున్సిపల్ ట్యాంకర్ల ద్వారానే నీటిని సరఫరా చేస్తూ అక్రమ నిర్మాణాన్ని ప్రోత్సహిస్తోంది. జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట గ్రామ శివారులోని ఎస్సారెస్పీ కాలువ వద్ద ఓ వ్యాపారి ఇటీవల భూమిని కొనుగోలు చేశాడు. తన భూమిలోకి వెళ్లేందుకు ఎస్సారెస్పీ కాలువను జేసీబీ సహాయంతో తవ్వి నీరు రాకుండా పూడ్చివేసి కల్వర్టు నిర్మాణం చేపడుతున్నాడు. ఈ కల్వర్టు నిర్మాణానికి స్థానికంగా నీరు లేకపోవడంతో మున్సిపల్ వారే రెండు ట్యాంకర్లను పనిజరిగే చోట ఉంచి



కల్వర్టు నిర్మాణ స్థలం వద్ద మున్సిపల్ ట్యాంకర్లు

నీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో స్థానికులు విషయాన్ని అర్బన్ తహసీల్దార్‌కు వివరించగా రెవెన్యూ సిబ్బంది అక్కడకు వెళ్లి అక్రమ కట్టడాన్ని నిలిపివేయాలని సూచించారు. అలాగే స్థానికంగా ఉన్న భూయజమాని కూడా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. కానీ ఏకంగా మున్సిపల్ అధికారులే వాటర్ ట్యాంకులు పంపించి అక్రమ నిర్మాణాన్ని ప్రోత్సహించడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.

'అసత్యపు ఆరోపణలు సరికాదు'

సారంగాపూర్(జగిత్యాల): గ్రామ పంచాయతీలో చేసిన పనులకు బిల్లులు అడిగితే తమపై ఎంపీవో, బీర్‌పూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని బీర్‌పూర్ సర్పంచ్ గర్షకుర్తి శిల్ప పేర్కొన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ, పంచాయతీ కార్యదర్శి తన భర్తపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, మహిళా సర్పంచ్ అని చూడకుండా ఇష్టారీతిగా మాట్లాడటంతో తాము కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. 2022లో గ్రామ పంచాయతీలో చేసిన స్టేట్ ఫైనాన్స్, 14వ ఆర్థిక సంఘం నిధులతో చేసిన ఆరు పనులకు సంబంధించి రూ.6,18,710 బిల్లులు చెల్లించేందుకు గ్రామ పంచాయతీలో తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. చేసిన పనులకు సంబంధించి డబ్బులు తీసుకున్నామని, అదనంగా డబ్బులు తీసుకోలేదన్నారు. ఎంపీవోతో ఎదురవుతున్న ఇబ్బందులపై జిల్లా అదనపు కలెక్టర్, డీపీవోకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తమపై పంచాయతీ కార్యదర్శి నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, అధికారులు విచారణ జరపాలని వారు కోరారు.

పిస్టల్‌తో బెదిరించి డబ్బు సంపాదించేందుకు..

- పథకం పన్నిన వ్యక్తి అరెస్ట్
- రివాల్వర్, మూడు బుల్లెట్‌లు, సెల్‌ఫోన్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ ఎగ్గడి భాస్కర్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ భాస్కర్,



పోలీసులు స్వాధీనం చేసుకున్న పిస్టల్, బుల్లెట్లు, సెల్‌ఫోన్

జగిత్యాలక్రైం: వ్యాపారాల్లో వచ్చిన నష్టాన్ని పూడ్చుకునేందుకు అక్రమ మార్గంలో డబ్బు సంపాదించాలనే పథకం పన్నిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఎగ్గడి భాస్కర్ వివరాలు వెల్లడించారు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామానికి చెందిన సందరగిరి లక్ష్మీనర్సయ్య బుధవారం సాయంత్రం 6.30 గంటలకు ద్విచక్ర వాహనంపై తన గ్రామం నుంచి కోరుట్ల వస్తుండగా సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై సతీశ్ వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో వారిని చూసి తప్పించుకునే ప్రయత్నం చేశాడు. దీంతో పోలీసులు అతన్ని పట్టుకుని తనిఖీ చేయగా ద్విచక్ర వాహనంలో పిస్టల్ (ఆటో పిస్టల్ మేడ్ ఇన్ యూఎస్‌ఏ)తో పాటు రెండు మ్యాగ్జిన్‌లు, మూడు బుల్లెట్‌లు (కేఎఫ్ 7.65 ఎంఎం), సెల్‌ఫోన్ లభించాయి. వాటిని స్వాధీనం చేసుకొని అతడిని అదుపులోకి తీసుకున్నారు.

అక్రమ మార్గంలో..

అనంతరం నిందితుడిని విచారణ చేపట్టగా పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. లక్ష్మీనర్సయ్య కొన్నేళ్లుగా పండ్ల వ్యాపారం చేస్తూ సుమారు రూ.50 లక్షలు నష్టపోయాడు. అక్రమమార్గంలో డబ్బు సంపాదించాలని 7 నెలల క్రితం ముంబయ్‌లో అసాంఘిక వ్యక్తులతో పరిచయం ఉన్న అయిలాపూర్‌కు చెందిన మాజీ నేరస్తుడు రాజుబాయి అలియాస్ గంగారాంను కలిశాడు. అతడి ద్వారా నారాయణ, రమేశ్, పాటిల్, బిట్టు అలియాస్ బంటి సాయంతో రూ.60 వేలకు పిస్టల్ కొన్నాడు. కొద్ది రోజుల క్రితం అయిలాపూర్ శివారులోని అటవీప్రాంతంలో పిస్టల్‌ను పేల్చి పరీక్షించాడు. ఈనేపథ్యంలో అయిలాపూర్ చుట్టు పక్కల గ్రామాల్లో పలువురు వ్యక్తులను బెదిరించి సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో బుధవారం ద్విచక్రవాహనంపై కోరుట్లకు వస్తుండగా రైల్వేబ్రిడ్జి వద్ద పోలీసులు పట్టుకున్నారు.

ఆరుగురిపై కేసు

ఈ కేసులో లక్ష్మీనర్సయ్యతో పాటు రాజుభాయ్ అలియాస్ గంగారాం, ముంబయ్‌లో నివాసముంటున్న నారాయణ(ఆర్మర్), ముంబయ్‌కి చెందిన రమేశ్, పాటిల్, బిట్టు అలియాస్ బంటిపై కేసు నమోదు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్‌రెడ్డి, కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై సతీశ్, సిబ్బంది సత్తయ్య, సంతోష్, కేశవ్, సాగర్, శ్రీనివాస్‌ను ఎస్పీ అభినందించారు. వీరికి త్వరలోనే రివార్డులు అందించనున్నట్లు పేర్కొన్నారు.

కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతాల్లో..

లక్ష్మీనర్సయ్య పాత నేరస్తుడు రాజుబాయి అలియాస్ గంగారాంతో కలిసి పథకం రూపొందించి కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతాల్లో డబ్బున్న వారిని బెదిరించి సంపాదించాలని పథకం పన్నాడు. ఈనేపథ్యంలో అయిలాపూర్ సమీపంలో ఓ వ్యక్తి వద్ద పిస్టల్ దొరికిందనే సమాచారం వ్యాపించడంతో చర్చనీయాంశంగా మారింది.

ఇద్దరు సీఐలకు పదోన్నతి

జగిత్యాలక్రైం: జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. జగిత్యాల ఎస్బీ సీఐగా పనిచేస్తున్న రాజశేఖర్‌రాజు, డీసీఆర్బీలో పనిచేస్తున్న సీఐ శ్రీనివాస్‌కు పదోన్నతులు కల్పిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

సర్పంచ్ భర్తపై కేసు

సారంగాపూర్(జగిత్యాల): గ్రామ పంచాయతీ కార్యదర్శి సతీశ్‌కుమార్ విధులకు ఆటంకం కలిగించిన బీర్‌పూర్ సర్పంచ్ భర్త రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ రవీందర్ తెలిపారు. గ్రామ పంచాయతీలో విధులు నిర్వహిస్తున్న కార్యదర్శిని బిల్లుల చెల్లింపుల విషయంలో అసభ్యపదజాలంతో దూషించి, విధులకు ఆటంకం కలిగించాడని సతీశ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదుపై రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

160 ట్రాక్టర్ల ఇసుక డంపు

- స్వాధీనం చేసుకున్న మైనింగ్ అధికారులు
- రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్



ఇసుక డంపు

మెట్‌పల్లి(కోరుట్ల): మండల పరిధిలోని ఆత్మనగర్ గ్రామ శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంప్‌లను మైనింగ్ అధికారులు సీజ్ చేశారు. వివరాలిలా ఉన్నాయి.. ఆత్మనగర్ గ్రామ సమీపంలోని వాగు నుంచి కొందరు ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని న్యాయవాది సుమలత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో గ్రామ శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 160 ట్రాక్టర్ల ఇసుకను మైనింగ్ ఆర్‌ఐ నిర్మల సీజ్ చేశారు. అలాగే అటుగా వెళ్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఈనేపథ్యంలో వాగు నుంచి ఇసుకను అమ్ముకునేందుకు ఇటీవల గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వేలం నిర్వహించినట్లు తెలిసింది. సదరు వేలంలో కొందరు అత్యధికంగా రూ.10లక్షలకు పాట పాడి దక్కించుకున్నట్లు సమాచారం. కాగా భారీగా ఇసుకను తరలిస్తుండడంతో భూగర్భజలాలు పడిపోయి గ్రామానికి నీటి సమస్య తలెత్తుతుందని న్యాయవాది సుమలత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మైనింగ్ ఆర్‌ఐ డంప్‌లను స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా

ప్రశంసాపత్రం అందజేత


ప్రశంసా పత్రం అందుకుంటున్న నవీన్ కుమార్

కోరుట్లటౌన్: హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సీఎం కప్ క్రీడల్లో భాగంగా ఖోఖో పోటీల్లో పట్టణానికి చెందిన పీఈటీ వాసం నవీన్ కుమార్ గురువారం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్ చైర్మన్ ఆంజనేయగౌడ్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. బీసీ కాలనీకి చెందిన నవీన్ కుమార్ ఇటీవల రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు టెక్నికల్ ఆఫీసర్‌గా ఎంపికయ్యాడు. రిటైర్డు పీఈటీలు వెంకట్‌రెడ్డి గంగాధర్, సీహెచ్, లక్ష్మీనారాయణ, ఖోఖో సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

దళితరత్న అవార్డుకు ఎంపిక


చెంగలి గంగాధర్

రాయికల్: పట్టణానికి చెందిన ప్రముఖ గాయకుడు సంఘ సంస్కర్త చెంగలి గంగాధర్ దళితరత్న అవార్డుకు ఎంపికైనట్లు ఆలిండియా మాల మహానాడు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా చెంగలి గంగాధర్‌ను పట్టణ అధ్యక్షుడు బైరి రాజేందర్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ప్రసాద్ అభినందించారు.

ఫోన్ అప్పగింత


బాధితుడికి సెల్‌ఫోన్ అప్పగిస్తున్న రూరల్ సీఐ ఆరిఫ్ అలీఖాన్

జగిత్యాలక్రైం: సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా చోరీ అయిన ఫోన్లను గుర్తించి బాధితులకు అప్పగించనున్నట్లు రూరల్ సీఐ ఆరిఫ్ అలీఖాన్ అన్నారు. గురువారం బీర్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తాళ్లధర్మారం, కమ్మునూర్ మధ్యలో షేక్ రహీం మొబైల్‌ను పోగొట్టుకున్నాడు. సీఈఐఆర్ గుర్తించి బాధితుడికి ఫోన్ అప్పగించారు. సీఐ మాట్లాడుతూ.. ఎవరైనా ఫోన్ పోగొట్టుకున్నా, చోరీకి గురైనా సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసినట్లయితే గుర్తించవచ్చన్నారు.

కుక్క దాడిలో బాలుడికి గాయాలు


గాయపడిన ఉమర్

మెట్‌పల్లి : వీధికుక్క దాడిలో ఓ బాలుడు గాయపడ్డాడు. పట్టణంలోని రేగుంట ఎస్సారెస్పీ కట్ట ప్రాంతానికి చెందిన ఉమర్ (8) బుధవారం రాత్రి ఇంటి ముందు కూర్చొని ఉండగా వీధికుక్క దాడిచేసింది. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి జగిత్యాలలో ఆస్పత్రికి వెళ్లారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

- వైద్యుల నిర్లక్ష్యంతోనేనంటూ బంధువుల ఆందోళన

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్‌లో గల ఆస్పత్రిలో ఓ వ్యక్తి మృతిచెందగా వైద్యుల నిర్లక్ష్యంతోనేనంటూ బంధువులు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. గొల్లపల్లి మండలం తిర్మలాపూర్‌కు చెందిన అరుణ్ (38) అనారోగ్యంతో పది రోజుల క్రితం ఆస్పత్రిలో చేరాడు. అప్పటి నుంచి వైద్యులు చికిత్స అందిస్తుండగా గురువారం రాత్రి మృతిచెందాడు. రూ. 3లక్షల వరకు వైద్యం కోసం ఖర్చుచేశామని, వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతిచెందాడంటూ బంధువులు ఆందోళన చేపట్టారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని ఆందోళన విరమింపజేశారు.

వరి కొయ్యలను కాల్చొద్దు

- అవగాహన లేమితో కాల్చుతున్న రైతులు
- భూమిలోనే కలియ దున్నితేనే లాభం
- అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు


వరి కొయ్యలను కాల్చుతున్న రైతు

జగిత్యాల అగ్రికల్చర్: జిల్లాలో వానాకాలం, యాసంగి సీజన్లలో దాదాపు 3 లక్షల ఎకరాల్లో వరి పంట సాగవుతోంది. పంటను కోయించిన తర్వాత రైతులు వరి మొదళ్లు (కొయ్యలను) కాల్చుతున్నారు. దీంతో రైతులకు ఉపయోగం కంటే నష్టమే ఉంటుందని, ఉందని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. గతంలో పంటల అవశేషాలు (చెత్త, చెదారం, పత్తి కట్టె, వరి కొయ్యలు) తగుల పెట్టకుండా భూమిలోనే దున్నేవారు. ప్రస్తుతం వరికొయ్యలు కాల్చుతుండటంతో ఎన్ని ఎరువులు చల్లినా పంట దిగుబడి తగ్గుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. రైతులను చైతన్య పరిచేందుకు వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నారు.

మోతాదుకు మించి రసాయనాలు

పంట దిగుబడికి వాతావరణం, నాణ్యమైన విత్తనాలే కారణమని చెబుతుంటారు. దిగుబడి కోసం భూమిలో మోతాదుకు మించి రసాయన ఎరువులు చల్లడంతో భూసారం తగ్గుతుంది. భూమిలో సేంద్రియ ఎరువులు చల్లడం వల్ల భూసారం పెరుగుతుంది. భూమిలో సహజసిద్ధంగా ఉండే నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి పోషకాలను సూక్ష్మజీవులు మొక్కకు అందిస్తూ పెరుగుదలకు సహకరిస్తాయి.

సేంద్రియ కర్బనం అంతంతే..

భూమిలో పశువులు, గొర్రెల, కోళ్ల ఎరువును భూమిలో చల్లి కలియదున్నితే పచ్చిరొట్ట ఎరువులతో భూమిలో సేంద్రియ కర్బనం ఏర్పడుతుంది. రైతులు ఎక్కువశాతం సేంద్రియ ఎరువులు చల్లడం లేదు. కలుపు మొక్కలు, చెత్త, చెదారం (పత్తి కట్టె, వరి కొయ్యకాళ్లు) భూమిలో కలియదున్నాలని చెబుతున్నా రైతులు దున్నడం లేదు. రొటోవేటర్‌తో దున్నితే పంట అవశేషాలు భూమిలో కలిసిపోయి, పెద్దగా రసాయన ఎరువుల అవసరం లేకుండా పంటలు పండించవచ్చు.

ఒకరిని చూసి మరో రైతు..

ఒకరైతును చూసి, మరో రైతు పంట అవశేషాలను కాల్చుతున్నారు. దీంతో భూమిలో ఉండే సూక్ష్మజీవులు చనిపోతున్నాయి. పొగతో వాతావరణం కలుషితమవుతుండటంతో పాటు శ్వాసకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. కొన్నిసార్లు భూమిలోని అవశేషాలు తగలబెడుతున్న సమయంలో భూమిపక్కన మామిడి చెట్లు, హరితహారం మొక్కలు, విద్యుత్ వైర్లు, మోటార్లు కాలిపోతున్నాయి.

భూమిలోనే కలియదున్నుతా



వరి పంటను కోయించిన తర్వాత కొయ్యలను కాల్చకుండా భూమిలోనే కలియదున్నుతున్నా. అదే సమయంలో జనుము విత్తనాలు అలుకుతున్నా. పూతకు వచ్చిన తర్వాత ట్రాక్టర్ కేజీవీల్స్‌తో దున్నడంతో భూమిలో కలిసిపోతుంది. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించా.

– సంగెపు జీవన్, లక్ష్మీపూర్, యువ రైతు

వరి కొయ్యలను భూమిలో దున్నితే లాభం



భూమిలో పంట అవశేషాలు కలియదున్ని, ఎకరాకు 3 బస్తాల సింగిల్ సూపర్ పాస్ఫెట్ చల్లితే భూమిలోనే ఎరువుగా ఉపయోగపడుతుంది. రసాయన ఎరువులకు పెట్టే ఖర్చు 50 శాతం తగ్గుతుంది. రైతులకు అవగాహన లేక వరికొయ్యలు కాల్చుతుండటంతో నష్టం వాటిల్లుతుంది.

– డాక్టర్ శ్రీనివాస్, పరిశోధనా స్థానం డైరెక్టర్, పొలాస

కార్మికులను విస్మరిస్తున్న ప్రభుత్వం

- చేనేత, పవర్‌లూం కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పంతం రవి


సమావేశంలో మాట్లాడుతున్న పంతం రవి

సిరిసిల్లటౌన్: బతుకమ్మ చీరలు నేసే కార్మికులు, ఆసాములను సర్కారు విస్మరిస్తోందని లాల్‌బావుటా చేనేత పవర్‌లూం కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పంతం రవి అన్నారు. గురువారం సిరిసిల్లలోని కార్మిక భవనంలో ఏర్పాటు చేసిన సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి కేటీఆర్ సిరిసిల్లలోని పవర్‌లూం పరిశ్రమకు అనుబంధంగా ఉన్న అన్నివర్గాల కార్మికులకు హామీలు ఇవ్వడమే తప్ప అమలు చేయడం లేదని విమర్శించారు. బతుకమ్మ చీరలు నేసే కార్మికులకు ఏళ్లుగా యారన్ సబ్సిడీ ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు అజ్జ వేణు, వడ్డేపల్లి లక్ష్మణ్, వంగరి సత్యనారాయణ, విజయ్‌కుమార్, రాజలింగం, తదితరులు పాల్గొన్నారు.

బడిబాటను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న నాయకులు

సిరిసిల్లఅర్బన్: ఈనెల 3 నుంచి ప్రారంభించే బడిబాటను విజయవంతం చేయాలని టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కావలి అశోక్‌కుమార్, కటకం రమేశ్ పేర్కొన్నారు. గురువారం టీఆర్‌టీఎఫ్ జిల్లా శాఖ సమావేశం జరిగింది. కార్యక్రమానికి రాష్ట్ర నాయకులు హాజరై మాట్లాడారు. విద్యార్థుల సంఖ్యను పెంచి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలన్నారు. పాఠశాలల ప్రారంభంలోనే విద్యా వలంటీర్లు, స్కావెంజర్లను నియమించాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బోయన్నగారి నారాయణ, ప్రధాన కార్యదర్శి బుర్ర కృష్ణ ప్రసాద్‌గౌడ్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్ల సేవలో ఎంపీ, డీసీసీ అధ్యక్షుడు


ఎల్లమ్మతల్లికి పూజలు చేస్తున్న ఎంపీ సంజయ్

గన్నేరువరం(మానకొండూర్): మండలంలోని మైలారంలో శ్రీ రేణుక ఎల్లమ్మ ఉత్సవాల్లో భాగంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్, నాయకులు సొల్లు అజయ్‌వర్మ, నగునూరి శంకర్‌లు గురువారం అమ్మవారిని దర్శించుకున్నారు. గనుకుల కొండాపూర్ గ్రామంలో పెద్దమ్మ తల్లిని దర్శించుకొని, పూజలు చేశారు. అలాగే డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు.

పేద కుటుంబానికి ఇంటి నిర్మాణం

- సొంత ఖర్చులతో నిర్మించిన రామగుండం తహసీల్దార్


ఇంటిని ప్రారంభించిన తహసీల్దార్ జాహెద్‌పాషా

రామగుండం: పట్టణంలోని ఎస్టీ కాలనీలో ఓ నిరుపేద కుటుంబానికి తహసీల్దార్ జాహెద్‌పాషా తన సొంత ఖర్చులతో ఇంటిని నిర్మించి, మానవత్వం చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఎస్టీ కాలనీకి చెందిన ధరావత్ లచ్చమ్మది పేద కుటుంబం. ఆమె కుమారుడు, కోడలు మృతిచెందగా మనవడు, మనవరాలితో పూరి గుడిసె ఉంది. ఇటీవలి అకాల వర్షాలకు అది కూలిపోయింది. దీంతో వారు తలదాచుకునేందుకు నీడ కరువైంది. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ సంగీత వారికి ఇంటిని నిర్మించి, ఇవ్వాలని రామగుండం తహసీల్దార్ జాహెద్‌పాషాకు సూచించారు. ఆయన తన సొంత ఖర్చులతో గుడిసె స్థానంలో అన్ని సౌకర్యాలతో కూడిన ఇల్లు నిర్మించి, గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్, స్వచ్ఛంద సంఘాల సలహాదారు దయానంద్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఆర్‌ఎంపీ దుర్మరణం

- పెద్దపల్లి శివారు బంధంపల్లి వద్ద ఘటన


రామస్వామి (ఫైల్)

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణ శివారులోని బంధంపల్లి వద్ద లారీ ఢీకొన్న ఘటనలో ఆర్‌ఎంపీ జక్కుల రామస్వామి(54) మృతిచెందగా ఒకరికి గాయాలయ్యాయి. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి మండలంలోని శాంతినగర్‌కు చెందిన రామస్వామి పాలకుర్తి మండలంలోని కొత్తపల్లిలో ఆర్‌ఎంపీగా చేస్తున్నాడు. నిత్యం కొత్తపల్లికి బైక్‌పై వెళ్లి వస్తుంటాడు. రోజూ మాదిరిగానే గురువారం ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో లారీ వేగంగా వచ్చి, ద్విచక్రవాహనాన్ని, ఓ ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన మృతిచెందగా ఆటోలో ప్రయాణిస్తున్న పెద్దపల్లి మండలంలోని అప్పన్నపేటకు చెందిన పిడుగు సతీశ్‌కు గాయాలయ్యాయి. రామస్వామి రెండు నిమిషాలైతే ఇల్లు చేరేవాడని, ఇంతలోనే ఘోరం జరిగిందని స్థానికులు కన్నీరు పెట్టుకున్నారు. మృతుడికి ముగ్గురు కూతుళ్లు కాగా రెండో అమ్మాయి పెళ్లి, నెల రోజుల క్రితమే జరిగిందని తెలిపారు. భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యా యి. ఎస్సై విజేందర్ కథనం ప్రకారం.. రెబ్బల్‌దేవ్‌పల్లి చెందిన సాయిరాం గురువారం బైక్‌పై కరీంనగర్ వెళ్తున్నాడు. కాట్నపల్లి శివారులో వెనుక నుంచి బైక్‌పై వస్తున్న జూలపల్లి మండలం తెలుకుంటకు చెందిన రామస్వామి ఢీకొట్టాడు. ఈ సంఘటనలో ఇద్దరూ గాయపడ్డారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కుక్కల దాడిలో బాలుడికి తీవ్ర గాయాలు

ఇల్లందకుంట(హుజూరాబాద్): మండలంలోని రాచపల్లి గ్రామంలో వీధికుక్కల దాడిలో ఆరేళ్ల బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన చెరుకు కేశవరెడ్డి కుమారుడు ఆరుష్‌రెడ్డి గురువారం సాయంత్రం ఇంటి వద్ద ఆడుకుంటున్నాడు. వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేయడంతో బాలుడి చేయి, భుజంపై గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చిన్నారిని రక్షించి, జమ్మికుంటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

పశుగ్రాసం దగ్ధం

బోయినపల్లి (చొప్పదండి): మండలంలోని కొదురుపాక గ్రామానికి చెందిన పెంజర్ల దేవయ్య ఇంటి సమీపంలో నిల్వ ఉంచిన పశుగ్రాసం గురువారం సాయంత్రం నిప్పంటుకొని దగ్ధమైంది. పశువుల మేతకోసం నిల్వ ఉంచిన గడివాములు ప్రమాదవశాత్తు కాలిపోయాయని దేవయ్య తెలిపాడు.

ఎల్లారెడ్డిపేటలో..

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): మండల కేంద్రంలోని భక్తి సంఘం సమీపంలో నిప్పంటుకొని గడ్డి వాములు దగ్ధమయ్యాయి. మండలకేంద్రానికి చెందిన బింగి మల్లేశం, గడ్డమీది నరేశ్‌కు చెందిన గడ్డి వాములు పొలం వద్ద నిల్వచేయగా నిప్పంటుకొని దగ్ధమయ్యాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా సకాలంలో మంటలను ఆర్పారు. గుర్తు తెలియని వ్యక్తులు అటు వైపు వెళ్తూ నిప్పంటించారని అనుమానిస్తున్నారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎంపీటీసీ బాల్‌రాజ్ కోరారు.

ఉరేసుకుని వృద్ధుడి ఆత్మహత్య

ధర్మారం: మండలంలోని నందిమేడారం గ్రామానికి చెందిన ఆరవేని మల్లయ్య (70) అనారోగ్యంతో గురువారం ఉదయం గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మందులు వాడుతున్నా నయం కాకపోవటంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుమారుడు కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ వెంటనే చేపట్టాలి

కరీంనగర్: ఎస్సీ వర్గీకరణ వెంటనే చేపట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బెజ్జంకి అనిల్, ఎమ్మెస్పీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి ఇంజం వెంకటస్వామిలు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఈ నెల 5న ఉమ్మడి కరీంనగర్ జిల్లా మహాసభ నిర్వహిస్తున్నామని, మాదిగలు అధిక సంఖ్యలో తరలివచ్చి, విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు గురువారం కరీంనగర్‌లోని కోర్టు చౌరస్తాలో గల అంబేడ్కర్ విగ్రహం వద్ద సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణను నిర్లక్ష్యం చేస్తూ వచ్చిన బీజేపీ కర్ణాటక ఎన్నికల సందర్భంగా ఆ రాష్ట్రంలో వర్గీకరణకు తీర్మానం చేయడం, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతపై సానుకూల ప్రకటన చేయడం శుభపరిణామని అన్నారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా రూట్ మ్యాప్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం దేశంలో ఎస్సీ వర్గీకరణ సాధించుకోవడానికి అనుకూలమైన వాతావరణం ఉందన్నారు. అందుకోసమే ఊరూరా మాదిగలను కదిలించడానికి ఉమ్మడి జిల్లా మహాసభ నిర్వహిస్తున్నామని తెలిపారు. కలెక్టరేట్ ఎదుట ఉన్న రెవెన్యూ గార్డెన్‌లో జరిపే సభకు ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హాజరవుతారని పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు ఆవునూరి ప్రభాకర్, అంబల రాజేందర్, చిలుముల రాజయ్య, ఖానాపూర్ లక్ష్మణ్, రుద్రారం రాంచందర్, తుంగ ఆంజనేయులు, చెంచాల నవీన్, కనకం అంజయ్య, తడగొండ శంకర్, దేవునూరి రవీందర్, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

723 చెరువులు.. 1.59 కోట్ల చేపపిల్లలు

- జిల్లాలో చేపల పిల్లల పంపిణీకి సర్వం సిద్ధం
- ఈనెల 8,9,10 తేదీల్లో ఫిష్‌ఫుడ్ ఫెస్టివల్


పంపిణీకి సిద్ధంగా ఉన్న చేపపిల్లలు

జగిత్యాలరూరల్: మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం ఏటా ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తోంది. అందులో భాగంగా ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో జిల్లాలోని 723 చెరువులు, కుంటలు, మరో రిజర్వాయర్‌కు మొత్తం 1,59,29,000 చేప పిల్లలు అవసరం అవుతాయని జిల్లా మత్స్య శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రతిపాదనల ప్రకారం ప్రభుత్వం చేపపిల్లల సరఫరాకు టెండర్లు పిలిచింది.

చెరువుల విస్తీర్ణం బట్టి..

జిల్లావ్యాప్తంగా ఉన్న చెరువులు, కుంటలు, రిజర్వాయర్ విస్తీర్ణంతోపాటు వాటికి ఉన్న నీటి వసతిని బట్టి చేపపిల్లలను సరఫరా చేయనున్నారు. ఇందులో భాగంగా 100 ఎకరాల్లోపు ఉన్న 540 చెరువులు, కుంటల్లో 35 నుంచి 40 ఎంఎం సైజు గల 47,61,000 చేప పిల్లలు, 100 ఎకరాల పైబడి విస్తీర్ణంలో ఉన్న 183 చెరువులతో పాటు ఎల్లంపల్లి రిజర్వాయర్‌లో 82 నుంచి 100 ఎంఎం సైజు ఉండే 1,11,68,000 చేప పిల్లలను పంపిణీకి సిద్ధం చేశారు. చెరువులు, కుంటల సామర్థ్యం బట్టి చేపపిల్లల సైజును మత్స్యశాఖ అధికారులు నిర్ధారించి ఆయా చెరువులకు సరఫరా చేస్తారు. జిల్లాలోని చెరువులు, కుంటలకు ఎక్కువగా సెప్టెంబర్ నుంచి మొదలు పెట్టి వర్షాలను బట్టి అక్టోబర్, నవంబర్ నెలల్లో చేపపిల్లల పంపిణీ ప్రక్రియ పూర్తి చేస్తారు. ఒకవేళ వర్షాలు ముందస్తుగా పడి చెరువులు, కుంటలు నిండితే దానికి అనుగుణంగా చేప పిల్లల పంపిణీ కార్యక్రమం చేపట్టే అవకాశం ఉంటుంది.

17,820 మంది లబ్ధి..

జిల్లా వ్యాప్తంగా 183 మత్స్య సహకార సంఘాలు ఉండగా, అందులో 15,300 మంది సభ్యులుగా ఉన్నారు. అలాగే 46 మహిళా మత్స్య సహకార సంఘాల్లో 2,520 మంది సభ్యులున్నారు. ఈ సంఘాలతో పాటు గ్రామ పంచాయతీలకు చెందిన మత్స్యకారులకు ఉచిత చేపపిల్లలతో లబ్ధి చేకూరుతుంది. దీని ద్వారా జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల్లో కలిపి దాదాపు 17,820 మంది మత్స్యకారులు ఉపాధి పొందనున్నారు.

ఫిష్‌ఫుడ్ ఫెస్టివల్

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే వేడుకల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా చేప ఉత్పత్తుల ఆహార మేళా (ఫిష్‌ఫుడ్ ఫెస్టివల్)ను ఈనెల 8,9,10 తేదీల్లో జిల్లా కేంద్రంలోని శుభమస్తు గార్డెన్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఈ మేళాలో స్టాల్స్‌ను ఏర్పాటు చేసి చేపలు, రొయ్యలతో తయారుచేసిన పలు రకాల వంటల రుచులు ప్రజలకు తెలిసేలా విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

ప్రతిపాదనలు పంపాం



జిల్లాకు అవసరమైన ఉచిత చేపపిల్లల కోసం ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. 100 ఎకరాల విస్తీర్ణం లోపు ఉన్న 540 చెరువులు, కుంటలు, 100 ఎకరాల పైబడి ఉన్న 183 చెరువులతో పాటు ఎల్లంపల్లి రిజర్వాయర్‌లో చేపపిల్లలు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం.

– ఎల్.దామోదర్, మత్స్యశాఖ జిల్లా అధికారి

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు


గాయపడ్డ నరేశ్

కథలాపూర్: మండలకేంద్రం శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరికొండ గ్రామానికి చెందిన పాలెపు నరేశ్ అత్తగారి ఊరైన దుంపేట గ్రామం నుంచి స్వగ్రామం సిరికొండకు బైకుపై వెళ్తున్నారు. కథలాపూర్ శివారులో మూలమలుపు వద్ద వేములవాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నరేశ్‌కు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం కోరుట్ల ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మెట్‌పల్లి: పట్టణంలోని వెంకట్రావుపేట శివారులో జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గజ్జెల మనోహర్ (42) మృతిచెందినట్లు ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా రెంజర్‌లకు చెందిన మనోహర్ ద్విచక్రవాహనంపై మెట్‌పల్లికి వెళ్తుండగా, వెంకట్రావుపేట శివారులో బైక్‌ను కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో మనోహర్‌కు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆర్మూర్‌లోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుండెపోటుతో యువకుడు..


రాజేందర్ (ఫైల్)

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామానికి చెందిన రాజుల రాజేందర్ (30) గుండెపోటుతో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. రాజేందర్ గురువారం ఉదయం ఛాతిలో నొప్పిగా ఉందని కుటుంబ సభ్యులకు తెలిపాడు. జగిత్యాలలోని ఓ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. మృతుడికి భార్య మౌనిక, మూడేళ్ల కూతురు ఉంది.

ఇది పట్టా భూమే.. కాదు శిఖం


ట్రాక్టర్లతో దున్నిన భూమి


బైఠాయించిన ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు

- ట్రాక్టర్లతో దున్నించిన కరీంనగర్‌వాసులు
- అక్కడే బైఠాయించిన ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు
- మానకొండూర్ చెరువు వద్ద ఘటన

మానకొండూర్: స్థానిక పెద్ద చెరువు పైభాగంలో ఉన్న భూమికి తాము పట్టా కలిగి ఉన్నామని కరీంనగర్‌కు చెందిన కొందరు ట్రాక్టర్లతో గురువారం దున్నారు. ఆర్ఐ జయలక్ష్మి, పోలీసు సిబ్బంది అడ్డుకొని, అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ భూమి పట్టా భూమి అంటూ పట్టాదారు చెబుతుండగా శిఖం భూమి అని గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు అంటున్నారు. చివరకు దున్నిన భూమిలో గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు టెంట్ వేసి, బైఠాయించారు. వివరాల్లోకి వెళ్తే.. మానకొండూర్ పెద్ద చెరువును ప్రభుత్వం మినీ ట్యాంకుబండ్‌గా మార్చాలని భావించింది. దీనికిగాను 2016లో రూ.5.69 లక్షలు కేటాయించింది. చెరువు కట్టను అభివృద్ధి చేయడంతోపాటు, చెరువు శిఖంలో చిల్డ్రన్స్ పార్కు కోసం మూడెకరాల పైచిలుకు స్థలంలో వందలాది క్యూబిక్ మీటర్ల చెరువు మట్టిని పోసి, చదును చేశారు. గతేడాది గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో క్రీడాప్రాంగణం ఏర్పాటైంది. కాగా కరీంనగర్‌కు చెందిన మర్రి సతీశ్, సుందరమ్మ, జయమ్మ, నాగరాజు, మహిపాల్, ఉమాదేవిలు ఈ భూమి తమదేనంటున్నారు. 1274/2, 1274/3, 1274/4 సర్వే నంబర్లలో 9.39 గుంటల భూమిని ఇదే గ్రామానికి చెందిన బొప్పు నర్సయ్య నుంచి 1987లో కొనుగోలు చేశామని, పట్టాదారు పాసుపుస్తకాలతోపాటు, రైతు బంధు, రైతుబీమా పొందుతున్నామని తెలిపారు. 2.34 గుంటల భూమిపై వివాదం ఉండగా హైకోర్టును ఆశ్రయించామని, కోర్టు సైతం తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. అందుకే భూమిని దున్నడానికి వచ్చినట్లు తెలిపారు. అధికారులు తహసీల్దార్ లక్ష్మారెడ్డికి సమాచారం అందించారు. ఆ యన అక్కడికి వచ్చి, పట్టాదారులమని చెప్పుకుంటున్న వారి వద్ద ఉన్న పత్రాలను పరిశీలించారు. 15.06.23 వరకు దీనిపై కోర్టు స్టేటస్‌కో ఉన్నందున అప్పటివరకు ఆగాలని సూచించారు. సీఐ రాజ్‌కుమార్ వచ్చి, భూమి దున్నిన వ్యక్తులతో మాట్లాడా రు. ఈ స్థలం శిఖం భూమి అని జెడ్పీటీసీ సభ్యుడు తాళ్లపల్లి శేఖర్ గౌడ్, సర్పంచ్ రొడ్డ పృథ్వీరాజ్ పేర్కొన్నారు.

చెరువులో నీట మునిగి అస్వస్థత

రుద్రంగి (వేములవాడ): చెరువులో చేపలవేటకు వెళ్లిన వ్యక్తి అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రికి తరలించిన ఘటన మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. తోటి జాలరులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగికి చెందిన మత్స్యకారులు గురువారం మండల కేంద్రంలోని గోలెపు లొద్ది చెరువులో చేపల వేటకు వెళ్లారు. చేపలు పడుతుండగా ఎల్ల రాజనర్సయ్య (55) అస్వస్థతకు గురై నీట మునిగాడు. గమనించిన తోటి జాలరులు రాజనర్సయ్యను బయటకు తీసుకువచ్చి చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

భార్యపై హత్యాయత్నం

- రిమాండ్‌కు తరలించిన పోలీసులు

వేములవాడ రూరల్: వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లిలో భార్యపై భర్త హత్యాయత్నం చేయగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ వెంకటేశ్ తెలిపారు. మ్యాకల నర్సయ్య బుధవారం రాత్రి భార్య లక్ష్మీపై హత్యాయత్నానికి పాల్పడ్డాడని, చికిత్స నిమిత్తం వేములవాడలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. తరచూ భార్యాభర్తలు మధ్య గొడవ జరుగుతుందని, ఈ క్రమంలోనే నర్సయ్య హత్యాయత్నానికి పాల్పడినట్లు సీఐ పేర్కొన్నారు.